

బయట నుండి వినిపిస్తున్న వర్షం శబ్దం వింటూ సోఫాలో వెనక్కి వాలి పడుకుంది కృపాళిని.

చెయ్యి జారిన బంతి మెట్ల మీద ఎంత వేగంగా దొర్లుతూ మెట్లని దాటుతుందో, అంత కంటె వేగంగా కృప మనస్సు గతం జ్ఞాపకాల పొరలను దాటుతూ కృప కంట్రోలు తప్పి పోతోంది.

గత స్మృతుల సందర్భంలో జయరాజ్ పెద్దగా బూట్ల శబ్దం చేస్తూ వచ్చినా కృపలో చలనం కలగలేదు.

రెండు క్షణాలు వేచి చూశాడు జయరాజ్. కాని లాభం లేకపోయింది. టేబిల్ మీద వీక్లీని తీసి, తిరిగి టేబిల్ మీదకి విసిరికొట్టాడు విసుగ్గా.

వులిక్కిపడి కళ్లు విప్పి అతన్ని చూస్తూనే లేచి నిలబడ్తూ,

"ఎంతసేపయింది మీరొచ్చి?" అడిగింది కృప.

తీక్షణంగా కృప కళ్ళల్లోకి చూసి "అయితే చాలా సేపట్నించి ధ్యాన నిమగ్నులై వున్నారన్న మాట కృపాళిని గారు....వ్యంగ్య భరితంగా వచ్చాయి మాటలు.

మౌనంగా వుండిపోయింది కళ్ళు వాల్చుకుని.

రెండు క్షణాలు చూసి "ఏం: సమాధానం యివ్వడం చేతకాదా? లేకపోతే నిర్లక్ష్యమా?" రెచ్చిపోతున్నట్లుగా గట్టిగా అడిగాడు.

తలెత్తి జయరాజ్ కళ్ళల్లోకి చూసి "చాలా సేపట్నుంచి ఆలోచిస్తున్నానని అనుకున్నారు. నేను కాదన్నా మీరు అనుకున్న దాన్ని మార్చుకుని నా మాట వినరు. చెప్పి ఏం లాభం?" చాలా కూల్‌గా, మెల్లిగా అంది కృప.

. "అందుకని సమాధానం యివ్వ వన్న మాట. అడగడం బుద్ధి తక్కువ. నేనో ఫూల్‌గా కన్పిస్తున్నాను నీ కళ్ళకి...." నిండుకుండలా తొణక్కుండ నిలబడ్డ కృపని చూసి వుడికిపోతూ అన్నాడు.

"మీ రనుకున్నవన్నీ నే ననుకున్నానని అనుకుని నన్నిలా దోషిలా చూడ్డం తగదు జయరాజ్. మీరీ మధ్య కొత్తగ మారారు."

"అతి తెలివిగా మాట్లాడుతున్నావు. మాటల్లో పెట్టి విషయం మార్చడం గొప్ప కాదు" గిరుక్కున వెనక్కి తిరిగి పెద్దగా బూట్లశబ్దం చేస్తూ గదిలోకి వెళ్ళిపోయాడు.

"భగవాన్ యిదో కొత్త సమస్య ఎందుకు తెచ్చిపెట్టున్నావు?" బాధగా కళ్ళు మూసుకుంది కృప.

మరో పది నిమిషాల తర్వాత డ్రెస్ ఛేంజ్ చేసుకుని డైనింగ్ హాల్‌లోకి వెళ్లాడు. భోజనాలకి ఏర్పాటుచేస్తూకన్పించింది కృప.

మౌనంగా కుర్చీలాక్కుని కూర్చున్నాడు. కళ్ళు వాల్చుకుని ప్లేటు అతని ముందు వుంచింది.



ఆరోజు 'ఆలూ ఫ్రై'. అప్పుడప్పుడే నిశ్చలతకి వస్తున్న మనస్సులో తిరిగి అల్లకల్లోలం రేగింది.

వర్షం శబ్దం ఇంకా విన్పిస్తోంది.

రికార్డర్‌లోంచి మృదుమధురసంగీతం ఆ రోజుని ఆ సమయాన్ని కళ్ళకు కట్టింది,

* * *

"ఫాదర్, మదర్ లేకుండా చూసి నాకు మీల్స్ ఎరేంజ్ చేస్తున్నావన్నమాట" డైనింగ్ టేబుల్‌మీద మీల్స్‌కి ఎరేంజ్ చేస్తున్న కృపనిచూస్తూ అడిగాడు లక్ష్మన్.

"ఎందుకలా అబద్ధాలాడ్తారు? ఎన్నిసార్లు ఫాదర్‌తో మీరు మీల్స్ తీసుకోలేదు? అదికాదు విషయం, అందరూ వున్నప్పుడు మీరెంత తింటారో నాకు తెలియదు. ఇప్పుడు ఎవ్వరూ లేరు. నేను హాయిగా ఇప్పుడు మీరెంత తింటారో, ఎంత తినగలరో తెల్సుకోవచ్చు—" నవ్వుతూ అంది కృప. షవర్‌బాత్‌చేసిన జుట్టు ఫ్రీగా వదిలేసి, డార్క్ చాక్‌లెట్ కలర్ చీర వేసుకుంది. ఆ వాతావరణంలో కృప రూపం ఎంతో ఆహ్లాదకరంగా చూడ ముచ్చటగ వుంది.

తదేకంగా చూస్తూ "ఎంత తింటానో తెలిస్తే ఏమిటి లాభం నీకు?"

"ఎందుకంటే, ఎనిమిది గంటలకి ఫ్లయిట్‌కి వెళ్లాలంటే పైలట్‌గారు ఏడున్నరకి లేస్తారు. పదిహేను నిమిషాల్లో అన్నీ పూర్తిచేసుకోవాలి. కొంతమంది తొందరగా ఎంత తింటారో, నిదానంగా అంతే తింటారు. మరికొంతమంది తినలేరు. మీ తత్వం తెల్సుకుని మన పెళ్ళయిన తర్వాత మిమ్మల్నెప్పుడు లేపి, ఎంత తినిపించాలో నిర్ణయించుకునేందుకు...." నవ్వుతూనే చెప్పింది కృప.

"ఎందుకీ శ్రద్ధ?"

"వివరించాలా? ఇప్పుడు కాదులెండి. నాకాకలేస్తుంది" అంటూ కుర్చీ లాక్కుని కూర్చుంది,

"ఫైన్, ఫైన్ ఆలూ ఫ్రై—" చెప్పలేదేం కృపా? ఆలూ ఫ్రై అని తెలిస్తే నువ్వు పిలవకపోయినా యివాళ మీల్సుకి ఉండిపోయేవాణ్ణి—"

"అంత ఇష్టమా?" సంతోషంగా అడిగింది.

"చాలా.... నీ పెదాలకంటే ఆలూ ఫ్రై ఎక్కువ తెల్సా?" వెక్కిరిస్తూ అన్నాడు లక్ష్మన్.

గారాంగా పెదాలు చుట్టేసింది కృప.

* * *

ముద్ద నోట్లో పెట్టుకుంటుంటే కళ్ళ నుండి నీళ్ళు జారి బుగ్గలమీద నుండి కారిపోసాగాయి.

"ఛీ....ఛీ .... మనుషులన్నాక జ్ఞానం వుండాలి...." ప్లేట్లో చెయ్యి కడిగేసుకుని విసురుగా కుర్చీలాగి వెళ్ళిపోయాడు జయరాజ్.

హృదయం కలుక్కుమంటుంటె లేచి వెళ్లింది కృప అతని వెనుక.

"ఇప్పుడేమయింది జయరాజ్....నావల్ల పొరపాటు జరిగితే క్షమించి భోజనానికి రండి ప్లీజ్" అభ్యర్ధనగా చేతులు పట్టుకుంది కృప.

చేతులు విసిరికొట్టి మరోవైపుకి తిరిగాడు. "ఎందుకిలా మాటిమాటికీ అలిగి నన్ను బాధపెట్టారు. మీకిది న్యాయం కాదు రాజ్" దీనంగా అంది.

"ఎలా అవుతుంది? కట్టుకున్నవాడి కష్టసుఖాలతో సంబంధం లేకుండా నీ ఆలోచనల్లో, నీ పర్సనల్ ఎఫైర్స్‌లో మునిగిపోవడం నీకు న్యాయం. ఎవణ్ణో ప్రేమించావని తెల్సి కూడ నీమీద ప్రేమచావక నిన్ను పెళ్లిచేసుకోవడం, కాస్త నా మొహం చూడమని అడగడం అన్యాయం కదూ?"

ఏరోజూ అంత యిదిగా మాట్లాడ్డం ఎరగని కృప అవాక్కయిపోయి "రాజ్" అంది అంతకంటె ఏం అనాలో తోచక.

"హు రాజ్....రాజ్ చచ్చినా దిక్కులేదు" ఆవేశంతో నిండిపోతూ దూకుడుగ అన్నాడు.

ఆ మాటలు వినలేక చేతుల్లో మొహం వుంచుకుని బావురుమంది కృప. కొన్ని క్షణాలు గడిచిపోయాయి.

కృప భుజాల మీద చేతులు పడ్డాయి.

"కృ... పా" మృదువుగా విన్పించాయి జయరాజ్ మాటలు.

---

◯ ఇద్దరు పిల్లలున్న ఓ అమెరికన్ యువతి భర్తకు విడాకులిచ్చి మరో సుందరాపుని పెళ్ళి చేసుకొంటోంది. వివాహ వేదికవద్ద అల్లరి చేస్తున్న తన పిల్లల్ని ఆ పెళ్ళి కూతురు ఇలా మందలించింది "ఇలా అల్లరి చేస్తే ఈసారి నా పెళ్ళికి మిమ్మల్ని తీసుకురాను జాగ్రత్త!"

కన్నీళ్ళతో తలెత్తి చూసింది. "నేను నిన్ను కోరింది ఏమిటి కృపా? కేవలం నాతో సరదాగా వుండమని, నాతో కలిసి నవ్వమని...అంతే కృపా నేను నిన్ను కోరింది. మరే పెద్దవరాలూ నిన్ను కోరలేదే! ఈ చిన్న కోరిక తీర్చలేవా? నువ్వు గతాన్ని మర్చిపోవడానికి ఏం చేసినా నేను అడ్డుకోలేదే? ముచ్చటగా వుండే బారెడు జడ భుజాలవరకు కట్ చేసుకున్నా, చీరలు కట్టుకోడం మానేసి జీన్స్, బెల్‌బాటమ్స్ వేసుకున్నా, ఆభరణాలు ధరించడం మానేసినా ఏం చేసినా నేను ఒక్క చిన్న ఎక్స్‌ప్లనేషన్ కోరలేదే? ఎందుకని? నువ్వేంచేసినా ఫర్వాలేదు. కాని నువ్వు గతాన్ని మర్చిపోయి నాతో జీవితం పంచుకోమని నా ప్రార్థన కృపా—అంతే."

కన్నీళ్ళతో అతని మొహంలోకి చూస్తుండిపోయింది.

*  *  *

రాత్రి పదకొండు దాటింది.

కృపా, డాక్టర్ అజయ్‌ల మధ్య రౌండ్స్ తిరిగిపోతున్నాయి.

కృప కళ్ళు ఎర్రబడిపోయాయి.

అప్పటివరకు సోఫాలో జారగిలపడి చెప్తున్న కృప కళ్ళు తెరచి అజయ్‌కేసి చూసింది.

తదేకంగా చూస్తూ కన్పించాడు అజయ్.

"అజయ్, అదే మొదటిసారి జయరాజ్ నాతో అలా మాట్లాడ్డం. ఆ తర్వాత రెండుసార్లు ఇలాంటి సంఘటనలే, ఇలాంటి సంభాషణలే జరిగాయి. మొదట దూకుడుగా మాట్లాడిన తర్వాత ఎంతో మృదువుగా లాలించి 'గతాన్ని మర్చిపో కృపా' అని బోధిస్తుండేవారు. కాని ఆపని నాకసాధ్యం అయిపోయింది అజయ్. ఏ చిన్న పలుకు కాని, పని కాని నాకు లక్ష్మన్ మధ్య సంఘటనల్ని జ్ఞప్తికి తెచ్చి నా మనస్సు నా కంట్రోల్లో వుండేది కాదు. ఎంత తప్పిద్దామని ప్రయత్నించినా ఓటమి అంగీకరించవల్సి వచ్చేది" అంటూ నవ్వి "ఇప్పటికి అంగీకరించాల్సిందే అజయ్. అది నా బలహీనతే అనుకోండి, మరేదైనా అనుకోండి, నేమిట్ ఇన్ ఎనీవే" అంటూ తిరిగి కళ్ళుమూసుకుంది.

*  *  *


ఆరోజు ఆదివారం.

జయరాజ్ ఎక్కడో పనుండి వెళ్ళాడు.

ఆరోజు లక్ష్మన్ బర్త్‌డే ... ఎంత మనస్సుని కట్టుదిట్టంచేసినా ఆదుపు తప్పుతోంది.

"మీరే యివాళ ఈ లోకంలో వుంటే ఎంత గొప్పగా మీ బర్తుడే సెలబ్రేట్ చేసుకునేవారు లక్ష్మన్. మీ పత్నిగా మీ పక్కన నిలబడి తోటి ఆఫీసర్స్ మధ్యలో మీ ఆనందాన్ని నేను పంచుకునే భాగ్యం లేకపోయింది."

పైలెట్ డ్రెస్‌లో హుందాగా, నిల్ల




క్ష్యంగా నిలబడ్డ లక్ష్మన్ మూర్తిని చూస్తూ ఈలోకాన్నే విస్మరించింది కృప.

ఎంతసేపయిందో మరి, జయరాజ్ వచ్చి ఆమె వెనగ్గా నిలబడ్డాడు.

నిమిషాలు దొర్లి పోతున్నాయి.

కాని కృపలో చలనం లేదు.

దగ్గరగా వెళ్ళి వెనకనుండి కృప చేతి లోంచి ఫోటోను తీసుకున్నాడు జయరాజ్.

వులిక్కిపడి వెనుతిరిగి చూసింది.

అతన్ని చూస్తూనే తడబాటుగా "మీ ... మీ....రెప్పుడు వచ్చారు" అడిగింది.

"చాలా సేపయింది" ఆమె కళ్ళల్లోకి చూస్తూ చెప్పాడు.

"ఓ" ఒణుకుతున్న కిందపెదవిని మునిపళ్ళకిందికి లాక్కుంది. కొంతసేపు వాళ్ళిద్దరి మధ్య ఎలాంటి మాటలు లేవు.

"ఇవాళ లక్ష్మన్ బర్త్ డేనా? డెత్ డేనా?" టేబుల్ మీద గులాబులు చూస్తూ అడిగాడు హఠాత్తుగా. గొంతులో తీక్షణతే ఎక్కువగా విన్పిస్తోంది.

ఆ మాటలకి, ఆ మాటలు పలికిన తీరుకి కృప గుండెలు విలవిల తన్నుకున్నాయి. ఏడ్పు వుప్పెనలా వచ్చింది.

"ఇంత కఠినంగా ఎలా మాట్లాడగలుగుతున్నారు రాజ్?" అడక్కుండా వుండలేకపోయింది.

"కఠినమా? నిజమేలే. నీ లక్ష్మన్ బర్త్ డేనా, డెత్ డేనా అని అడగటంకూడా నేరమైపోయింది. నేను బయటికి వెళుతున్నాను".

"భోజనం చేసి వెళ్ళండి" కళ్లు తుడ్చుకుంటూ అంది.

"ఓ.... మీల్స్ ప్రిపేర్ చేశావా? చేసుండవనుకున్నాను. నువ్వెందుకు? నేను పెట్టుకుంటాలే" అంటూ ఫొటో

టేబిల్ మీద పెట్టేసి డైనింగ్ హాల్ వైపు నడిచాడు.

అతని వెనకే వెళ్ళింది. "నువ్వు తీసుకున్నావా మీల్స్"

"అయిపోయింది" కళ్లు నాల్చుకుని చెప్పింది.

క్షణం ఆమె మొహంలోకి చూసి "అయితే కంపెనీ సేక్ కొద్దిగా తీసుకో. కమాన్" అంటూ కుర్చీలాగాడు.

"లేదు లేదు. ఇప్పుడే తీసుకున్నాను. జస్ట్ ఎ హాఫనవర్ బాక్" తప్పించుకోవాలని చూస్తూ అంది.

"యిట్సాల్‌రైట్. చాల కొద్దిగ కంపెనీ సేక్ అంటున్నానుగా" బలవంతంగా ఆమె కూర్చునేలా చేశాడు.

భోజనాలయిన తర్వాత "పిక్చర్‌కెళ్లాం వస్తావా?" అని అడిగాడు.

"పిక్చరా?" తటపటాయిస్తూ అంది కృప.

"అయామ్ సారీ, నువ్వు రావుగా"

"అదేం?"

"ఏమనికాదు. ఇవాళ ఎలా వస్తావు? నీ మనస్సు బాగోలేదు కదా?"

"వెల్సి అడగడం, సారీ చెప్పడం అర్థం ఏమిటి?"కృప మౌనంగా అనుకుంది.

గదిలో కెళ్ళిపోయింది.

* * *

"అజయ్! ఆ రాత్రి పన్నెండు ఆ ప్రాంతంలో మెలకువ వచ్చింది. పక్కన జయరాజ్ లేరు.

టేబుల్ దగ్గర ఏదో తిరగేస్తూ కన్పించారు. లేచి వెళ్ళాను.

నా డైరీ తిరగేస్తూ కన్పించారు. అంత అర్ధ రాత్రిపూట నా డైరీ తిరగెయ్యాల్సిన అవసరం ఏమిటి నాకర్థం కాలేదు. అదే సంగతి అడిగాను.

"నీ వుద్దేశం ఏమిటో తెలుసు కుందామని...."

"ఏ విషయంలో?" "నా పట్ల నీ ప్రవర్తన." తదేకంగా అతని కళ్ళల్లోకి చూస్తూ కొన్ని క్షణాలు మాట్లాడలేదు. తర్వాత, "దొరికిందా?". అదోలా నవ్వాడు జయరాజ్. "ఎలా దొరుకుతుంది? పేజీలన్నీ వాడిపోని సజీవమైన మధుర స్మృతులతో నిండి వున్నాయి. గతంలో నీకు, నీ లక్ష్మన్‌కి జరిగిన ప్రతిక్షణం ఒక్కో పేజీకి సరిపోవడంలేదు. ఎన్ని కాగితాల్లోనైనా అవలీలగా నిండిపోయే నీ అనుభూతుల మధ్య నన్ను గూర్చిన అభిప్రాయం అటుంచి నా పేరు రాయడానికి స్థలం వుండదు. వెతుక్కునీ లాభం లేదు."

డైరీ మూసేసి డ్రాయర్లోకి తోసి నిలబడ్డాడు.

"థాంక్సడ్డారు జయరాజ్. మీ మీదనాకు చాలా గౌరవం...అభిమానం." కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరుగుతుండగా అన్నాను.

ఆ మాటలకి అదోలా నవ్వాడు. నా

## రెండు ప్రశ్నలకు జవాబులు :

1. వెళ్ళింది ముగ్గురు తల్లులే గనుక రెండు కుర్చీలు మిగుల్తాయి కూడా మరి: కాదంటారా?

2. డాక్టర్‌గారి పేరు మిసెస్ పంకజం: ఒ. కే.

కళ్ళల్లోకి చూస్తూ "నా మీద నీ కుండాల్సింది అవి కాదు కృపా. అనురాగం, ఆరాధన," ఒక్కొక్క అక్షరం ఒత్తి పలుకుతూ అన్నాడు.

బదులుగా ఏం చెప్పాలో స్ఫురించ లేదు. అప్పటికా గొడవ అంతటితో ముగిసింది.

రోజు రోజుకి పిచ్చెక్కినట్టుగ తయారవసాగాడు. మనస్థిమితం కోల్పోయాడు. నిరాశక్తి, నిస్పృహతో కాలం గడుపుతున్నాడు.

చాలా రోజుల తర్వాతగాని అతనిలో మార్పుని గమనించ లేకపోయాను.

"మీరీ మధ్య అదోలా వుంటున్నారు." అన్నానొక రోజు.

"ఎలా?" భావరహితంగా నా కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

ఏం చెప్పాలో తోచలేదు నాకు.

రెండు క్షణాలు గడిచాయి. "అదోలా పరధ్యానగా." చివరికి ఎలాగో అన్నాను.

నవ్వాడు జయరాజ్. "తోడు లేని నాకు అదే తోడుగా మారింది కృపా."

* * *

చెప్పటం ఆపి దీర్ఘంగా నిశ్వసించింది కృప.

"నా ప్రవర్తన రెండు సంవత్సరాల జయరాజ్ ట్రయల్స్‌ని నిష్ప్రయోజనం చేసింది. యిక నేను మారనని తెల్సుకున్నారు. నన్ను చూస్తూ, నా మౌనాన్ని, ఆయనపట్ల నా నిర్లిప్తతని భరించలేక పోయారు.

* * *

"కృ....పా...." చదువు కుంటున్న కృప తలెత్తి చూసింది.

"ఊం...."

"ఎఫ్. ఆర్. సి. పి కి సీటు వచ్చింది యింకో నెలరోజుల్లో నేను యింగ్లండ్ వెళ్తున్నాను". తెల్లబోతూ చూసింది కృప.

"యింగ్లండా?"

"ఔను...."

ఏం అనాలో అర్థం కాలేదు. "అంటే మీ రొక్కరే వెళ్తారా?"

కృప కళ్ళల్లోకి చూశాడు జయరాజ్.

"ఎవర్ని తీసుకు వెళ్ళను?"

'నన్ను అందామనుకుంది కృప.'

"యిప్పుడు యింగ్లండ్ వెళ్ళి ఎఫ్. ఆర్. సి. పి చెయ్యవలసిన అవసరం ఏమిటి?" మాట్లాడలేదు.

ఛటుక్కున లేచి దగ్గరగా వెళ్ళింది కృప. "మాట్లాడరేం రాజ్...." దీనంగా చూసింది. అప్పటికీ మాట్లాడలేదు.

"మీరు మాట్లాడండి రాజ్....మీరు వెళ్ళిపోతే నేనేం కావాలి?"

"మీ నాన్నగారు కట్టించిన నర్సింగ్ హోమ్ వుంది. నువ్వు డాక్టర్వి. నర్సింగ్ హోమ్‌లో ప్రవేశించు. నీ వునికి అక్కడ మంచిని, అభివృద్ధికి తెస్తుంది."

నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ "మళ్ళీ ఎప్పుడొస్తారు?"

"బహుశా ఈ జీవితంలో నీకు నేను ఎదురవ్వకపోవచ్చు, కృపా...."

"రాజ్...." బిత్తరపోతూ చూసింది.

"ఎందుకని?" ఎండిపోయిన గొంతుతో అడిగింది.

"నిన్ను నువ్వు అర్థంచేసుకోలేని పరిస్థితుల్లో నువ్వు నన్ను పెళ్ళి చేసుకున్నావు కృపా. నీ డీప్ లవ్‌ని అర్థం చేసుకోలేక పోయావు. అర్థం చేసుకుని వున్న పక్షంలో నన్ను పెళ్ళిచేసుకుని వుండేదానివి కాదు. ఫోర్గివ్ కృపా....లీవిట్. పాస్ట్ ఈజ్ పాస్ట్. నువ్వు గతాన్ని మర్చిపోలేవు. గతంలో జీవిస్తూ ప్రస్తుతంలో తప్పుచేసిన మనిషివి. మైహార్ట్ ఫర్ యువర్ గ్రేట్ లవ్ టు వర్డ్స్ లక్ష్మన్. అతను చాలా అదృష్టవంతుడు. కాని ఒక విధంగా దురదృష్టవంతుడు. కృపా, యిప్పటికైనా నువ్వు కాస్త నీ లోకంలోంచి యివతలకి వచ్చి పరిస్థితుల్ని అర్థం చేసుకుని, నిన్ను నువ్వు తెల్సుకుని ప్రవర్తించు."

ఆ మాటలు ఎంతో నెమ్మదిగా, స్పష్టంగా వచ్చాయి జయరాజ్ నోటి నుండి.

అవాక్కయిన కృప శిలా విగ్రహంలా నిలబడింది.

ఆ నెల రోజులు గడిచిపోయాయి.

జయరాజ్ వెళ్ళిపోయే రోజు ఆసన్నమయింది.

గుండెల్లో ఏదో బరువు దిగినట్లుగా వుంది కృపకి.

జయరాజ్ మొహంలో ఏ భావం కన్పించటం లేదు.

చాలా గంభీరంగా వున్నాడు.

ప్లేన్ టైమ్ దగ్గరపడ్తున్న కొద్దీ కృప గుండెల్నెవరో కలిచివేసినట్లుగా మారిపోయింది.

ఆపుకోలేక వెక్కి, వెక్కి ఏడుస్తూ "నేనేదైనా తప్పుచేస్తే మన్నించండి రాజ్" అంది కృప.

భావరహితంగా నవ్వి వూరుకున్నాడు జయరాజ్.

ప్లేన్ దగ్గరికి కదిలివెళ్తూ "మై బెస్ట్ విషెస్ ఫర్ యు కృపా. మే గాడ్ బ్లెస్ యు....సీక్ ఎ బెటర్ వే ఫర్ యువర్ సెల్ఫ్" అంటూ దగ్గరగా తీసుకుని రెండు క్షణాలు ఆ కళ్ళల్లోకి చూస్తూ "కృపా.... ఈ చివరి సమయంలో నిన్నోకోరిక కోరుతున్నాను. తీర్చగలవా?" ఎంతో మార్ధవంగా, అదోలా అడుగుతున్న జయరాజ్ కళ్ళల్లోకి చూస్తుంటే కన్నీళ్ళాగలేదు.

బుగ్గలమీదుగా నీళ్ళు కారుతుంటే "తప్పకుండా రాజ్....ఏమిటి?"

"సంవత్సరంనుండి నిన్ను ముద్దు పెట్టుకోడం కూడ మర్చిపోయాను కృపా. చివరిసారిగా, నీ గుడ్‌బైగా, ఒక్కసారి" అంటూ ఆపేసాడు.

ఆ మాటలకి కృప హృదయం ద్రవించిపోయింది.

"తప్పకుండా రాజ్....తప్పకుండా.... ఎన్నికావాలంటే అన్ని."

కళ్ళనీళ్ళు ధారాపాతంగా కారుతుంటే, బొంగురుపోయిన గొంతుతో అంది కృప.

ప్లేన్ కదిలి వెళ్ళిపోయింది కృప కళ్ళ ముందే.

అందరు వున్నారనే ధ్యాస కూడ లేకుండ వెక్కి-వెక్కి ఏడ్చేసింది ప్లేన్ కనుమరుగు అవగానే.

* * *

సోఫాలో వెనక్కి వాలి వున్న కృప కళ్ళనుండి రెండునీటిబొట్లు జారిపోయాయి. వింటున్న అజయ్ గాఢంగా నిశ్వసించాడు.

"నా మూర్ఖప్రవర్తనవల్ల, నా అనాలి చితపు ప్రవర్తన మూలంగా జయరా నిండు జీవితం నిస్సారమయింది. ఆయ నిన్ను చేసుకుంటాను కృపా అనగా ఎయిమ్‌లెస్‌గా తలూపి ఆయన జీవితాన్ని బలిగొన్న పాపిష్టిదాన్ని అజయ్" పశ్చాత్త పంతో రగిలిపోతూ చెప్తున్న కృప వైపే తదేకంగా చూశాడు అజయ్.

కొద్దిసేపటికి తేరుకుంటూ "అజయ్.... మీపట్ల ఆకర్షితురాల్ని అయింది....' అంటూ ఆపి "కారణం వుంది అజయ్.



మీరు అంతా లక్ష్మన్‌లాగ కాకపోయిన మిమ్మల్ని చూడగానే నా లక్ష్మనే జ్ఞాపకం వస్తారు. మీరు మాట్లాడ్తుంటే నా లక్ష్మనే దిగి వచ్చినట్లుగా వుంటుంది. అందుకే మీతో మాట్లాడాలని వుంటుంది. నేనిలా దగ్గరగా వుంటుంటే మీలో మరో విధ మైన ఆలోచనలు రేకెత్తుతాయని నేనూ హించలేదు డాక్టర్. మీరు నర్సింగ్ హోమ్‌లో చేరిన మొదటిరోజు నాకా రాత్రంతా గతం కళ్ళకి కట్టినట్లుగా అయి నరకయాతన అనుభవించాను అజయ్. ఆ యాతన మీరూహించలేరు." బావురుమంది మరోసారి.

కొన్ని క్షణాలు గడిచాయి.

సోఫాలోంచి లేచాడు అజయ్, "మీరు జయరాజ్‌ని చాలా క్షోభపెట్టారు కృపా. మీరు లక్ష్మన్‌ని యిష్టపడ్తున్నారని ఆయ న్నుండి మీ మనస్సుని తిప్పుకోలేక మధన పడ్తున్నారని తెల్సి మిమ్మల్ని చేపట్టి, మీ మనస్సుని, తనువుని యథాస్థితిలోకి తిప్పా లని చూశారు. చివరికి అన్ని ట్రయల్స్ ఫెయిల్ అయిపోయి మీమీద అనురాగం చంపుకోలేక మీ నిర్లక్ష్యాన్ని భరించలేక పిచ్చెక్కి ఫారిన్ వెళ్ళిపోయారే కాని మిమ్మల్నేవిధంగా కూడ మీదారులనుండి బాధాకరంగా మళ్లించాలని చూడని ఆయన ఔన్నత్యానికి ఎలా జోహార్లు అర్పించాలో తెలియటం లేదు కృపా."

"యు ఆర్ రైట్ అజయ్. యు ఆర్ రైట్" వేదనతో రగిలిపోతూ అంది.

రాత్రి పన్నెండు దాటింది.

అజయ్ మనస్సులో కృప కోసం తెచ్చిన డైమండ్ రింగ్ తళుక్కున మెరి సింది. వెంటనే జయరాజ్ రూపం అజయ్ నిర్ణయాన్ని చెరిపివేసింది.

మెల్లగా వెను తిరిగి వెళ్లిపోయాడు అజయ్.

శోకదేవతలా సోఫాలో కూర్చుండి పోయింది డాక్టర్ కృపాలిని.

ఆ మర్నాడు అజయ్‌కి బదులు నర్సింగ్ హోమ్‌కి ఓ వుత్తరం వచ్చింది. అది రిజిగ్నేషన్ లెటర్.

దానిలో మరో కాగితం వుంది.

"డాక్టర్ కృపా..

నా రిజిగ్నేషన్ అందే వుంటుంది. ఎక్కడికి వెళ్తున్నానో నాకే తెలియదు. ఎప్పటికైనా తిరిగి హైద్రాబాద్ అంటూ వస్తే మీకోసం రాకమానను. దయచేసి గతాన్ని మర్చిపొమ్మని నా ప్రార్థన కృపా. గతంలో ఎన్నిరోజులు గడపగలరు? జీవి తంలో ఎప్పుడో మీకు ఒక తోడు అవ సరం. అన్నివేళలా, ఏ రోజునైనా, ఎన్ని సంవత్సరాలకైనా మీకోసం బాహువులు చాచి సిద్ధంగా వున్న మనిషి ఒకరు వున్నా రని మర్చిపోకండి కృపా. ఆవ్యక్తి ఎవరో వూహించగలరా? నేను కాదు... జయరాజ్. ఆయన ఔన్నత్యం మీకెప్పుడూ ఒంటరితనాన్ని సంభవింపచేయదు. ఏదో రోజు ఆయన దగ్గర్నుంచి వుత్తరం వస్తుంది. వచ్చి తీర్తుంది. నాకా నమ్మకం వుంది. జయరాజ్ మీ పాస్ట్‌విక్టిమ్‌గా మారడం నేసహించలేను.

ఆరోజు మాత్రం మీరు లక్ష్మన్‌ని మర్చిపోవాలి.

ఆ శుభసమయం త్వరలో రావాలని, జయరాజ్‌గారి జీవితంలో నవోదయం కావాలని దైవాన్ని ప్రార్థిస్తూ.

డాక్టర్ అజయ్.